సాక్షి
బాపట్ల
శనివారం | 16 | ఆగస్టు | 2025



ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి సారె

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు.

పెద్దింటమ్మకు గాజుల అలంకారం



అమరావతి: స్థానిక గ్రామ దేవత పెద్దింటమ్మ గుడిలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మ వారిని గాజులతో వైభవంగా అలంకరించారు. అనంతరం పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్ కార్యాలయ ఆవరణలో వేడుకలు



నగరంపాలెం: గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జెండా ఎగరవేసి, గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యాలయ, పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఎస్ఐలు సంపంగిరావు, ప్రసాద్, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి తీవ్ర గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

మేడికొండూరు : మండల పరిధిలోని గుండ్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన మహిళలు నల్లపాడు పరిధిలో ఓ వివాహానికి వెళుతూ పాటిబండ్ల నుంచి వస్తున్న ఆటో ఎక్కారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత గుండ్లపాలెం వద్ద ఎదురుగా గేదె అడ్డు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. సిరిపురం గ్రామానికి చెందిన మిరియాల లిల్లీ రాణి తీవ్రంగా గాయపడింది. ఆమెను ఆటో లాక్కొని వెళ్లడంతో పక్కటెముకలు దెబ్బతిన్నాయి. కుడి చేయితో పాటు ఒళ్లంతా గాయాలయ్యాయి. తలకు తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు లక్ష్మీహారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం గుంటూరు జిల్లా వడ్లమూడికి చెందిన భక్తులు 82 గ్రాముల బంగారు లక్ష్మీహారాన్ని కానుకగా సమర్పించారు. వడ్లమూడికి చెందిన వి.శ్రవణ్ కుమార్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ.8.50 లక్షల విలువైన 82 గ్రాముల బంగారం, పచ్చలతో తయారు చేయించిన లక్ష్మీహారాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు, ఇతర అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం నాల్గో శుక్రవారం, ఆగస్టు 15వ తేదీ సెలవుదినంతో పాటు, శనివారం శ్రీకృష్ణాష్టమి సెలవు, ఆదివారం ఇలా వరుసగా మూడు రోజుల సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. సెలవులకు తోడు వివాహ సుముహూర్తాలు కూడా ఉండడంతో నూతన వధూవరులు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి తరలివస్తుండడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. రాత్రి 10 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సగర్వం.. మురిసె త్రివర్ణం

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- జిల్లా కేంద్రంలో ఉత్సవాల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

బాపట్ల /బాపట్ల అర్బన్: స్వాతంత్ర్య దిన వేడుకలు శుక్రవారం స్థానిక బాపట్ల జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలు అంబరాన్ని అంటాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుల కవాతు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రాంగణంలో త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. దేశభక్తి గీతాలతో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. జాతీయత, సంస్కృతులను చాటుతూ తొమ్మిది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆలోచింప చేశాయి. జిల్లా అభివృద్ధిని వివరించేలా శకటాల ప్రదర్శన నిర్వహించారు. సమరయోధుల కుటుంబ సభ్యులైన మరుప్రోలు శ్రీనివాస్ రెడ్డి వెంకటేశ్వరమ్మ, యర్రం అన్నమ్మ, జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య కుటుంబ సభ్యురాలైన పింగళి రమాదేవిలను మంత్రి సత్కరించారు. అమర సైనికుల కుటుంబ సభ్యులైన షరిఫ్‌ల బేగం, షేక్ అత్తరున్నీసా, సింగంశెట్టి నాగ సుజాత, రబియా బీబీలకు ఇంటి స్థలాల పత్రాలను మంత్రి, కలెక్టర్‌లు పంపిణీ చేశారు.

జిల్లా అభివృద్ధికి సహకరించండి

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఫలాలను అట్టడుగు వర్గాల వారికి అందించడం, తద్వారా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో పయనించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. నిరుపేదలను ఆదుకునేందుకు పీ4 విధానాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ఈ విషయంలో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేనేత కార్మికుల అభివృద్ధికి అడుగులు వేస్తోందన్నారు. కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించడంతో చేనేతల కష్టాలు తీరుతాయన్నారు. సూర్యలంక బీచ్‌ను పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలతో ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ఎంఎం కొండయ్య, ఏపీ చేనేత కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సజ్జల హేమలత, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, ప్రముఖులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రుణసాయం అందజేత

360 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా రూ.3.60 కోట్ల రుణ సహాయం అందించారు. 28 మందికి పీఎంఈజీపీ రుణం, 340 మంది ఎస్‌హెచ్‌జీ వ్యాపారులకు రుణం, డ్వాక్రా సభ్యులకు బ్యాంక్ లింక్ ద్వారా రుణం, పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 19 మందికి నగదు, 6,570 మంది డ్వాక్రా సభ్యులకు స్త్రీనిధి రుణం, వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ఐదుగురికి లాప్‌టాప్‌లు, వినికిడి మిషన్లు, 8 మందికి మహిళలకు కోడిగుడ్లతో తయారు చేసే పదార్థాలు విక్రయించేందుకు బండ్లను అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతిని ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాల ఆలాపన, నృత్యాలు, ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. చీరాలకు చెందిన మహిత తన మైక్రో ఆర్ట్ ప్రతిభతో 65 పెన్సిళ్లపై డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, 86 పెన్సిళ్లపై నెల్సన్ మండేలా, 73 పెన్సిళ్లపై గాంధీ, 25 పెన్సిళ్లపై డొక్కా సీతమ్మ జీవిత చరిత్రలను, 800 పెన్సిళ్లపై భగవద్గీతలోని 700 శ్లోకాలను లిఖించి ఆకట్టుకున్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

జిల్లా వైభవాన్ని చాటేలా గీతం



బాపట్ల: జిల్లా చరిత్ర, వైభవాన్ని తెలియజేసేలా రూపొందిన ప్రత్యేక గీతాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిలు కలసి స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆవిష్కరించారు. జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కలెక్టర్ రచయితలకు పోటీలు నిర్వహించారు. అందులో నందిరాజు విజయ్ కుమార్ రచించిన గీతాన్ని ఉత్తమ గీతంగా ఎంపిక చేశారు. జె.నాగపూర్ణ, రమాదేవి స్వరకల్పనతో సంజయ్ కుమార్, రమాదేవి, కుమారి కీర్తి, స్వాతిలు గానం చేసిన గీతాన్ని వేదికపై ప్రదర్శించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, వీఆర్ క్రియేషన్స్ ఈ పాటను రూపొందించడంలో కృషి చేశారని మంత్రి దృష్టికి కలెక్టర్ తెచ్చారు.



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

మహానుభావుల త్యాగఫలంతో స్వేచ్ఛ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఎంతోమంది మహానుభావుల పోరాటం, ప్రాణ త్యాగాలతోనే స్వాతంత్ర్య ఫలాలు అందుకున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌పై జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగురవేశారు. త్రివర్ణ పతాకానికి ఆయన సెల్యూట్ చేసి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఆర్థికంగా ఎంతో పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. సైనికపరంగా, విదేశీ విధానాల పరంగా ప్రత్యేకత చాటుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు అందరం పునరంకితం అవుదామని తెలిపారు. ఇన్‌చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లికార్జున రావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్



ఢిల్లీ పబ్లిక్ విద్యార్థుల ప్రదర్శన

నిరుపేదలకు సత్వర న్యాయమే స్వాతంత్ర్యం



స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొన్న జిల్లా జడ్జి కె శ్యాంబాబు, ఇతర న్యాయమూర్తులు

బాపట్ల: నిరుపేదలకు సత్వరమే న్యాయం అందించటమే నిజమైన స్వాతంత్ర్యం లక్ష్యం అని జిల్లా జడ్జి కె శ్యాంబాబు అన్నారు. బాపట్ల జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా ఆరవ అదనపు జిల్లా జడ్జి కె శ్యాంబాబు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి శుభాకాంక్షలు అందజేశారు. అట్టడుగు వర్గాలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. అనంతరం నాటి త్యాగమూర్తుల సేవలను స్మరించుకున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె వాణి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం పవన్‌కుమార్, రిటైర్డ్ జిల్లా జడ్జి ఎస్ రమేష్, ఏజీపీ శ్యామలాదేవి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కే లక్ష్మీనారాయణ, బాపట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే అవినాష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

‘ఉచిత బస్సు ప్రయాణం’ ప్రారంభం



స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

చీరాల అర్బన్: సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా వ్యాప్తంగా స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. చీరాల ఆర్డీఓ టి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరయ్యారు. మహిళలతోపాటు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు బస్సులో ప్రయాణించారు. ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్దన్, ఆర్టీసీ ఆర్ఎం సామ్రాజ్యం, డిపో మేనేజర్ జె.శ్యామల, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులైన 31 మందికి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు, 20 మందికి వినికిడి మిషన్లను మంత్రి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- ఓ వర్గానికే అధికారులు సభలో కుర్చీలు వేశారంటూ మొదలైన గొడవ
- తర్వాత పరస్పరం దాడులకు తెగబడిన టీడీపీ నాయకులు

చీరాల టౌన్: జెండా వందనం సాక్షిగా తోటవారిపాలెం తెలుగు తమ్ముళ్లు కుమ్ములాటకు దిగారు. చీరాల మండలంలోని తోటవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో జెండా వందనం అనంతరం నిర్వహించిన గ్రామసభలో వారు బాహాబాహీకి దిగారు. తోటవారిపాలెం పంచాయతీ వద్ద నిర్వహిస్తున్న జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.భారతి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. టీడీపీలోని రెండు వర్గాల వారు కూడా హాజరయ్యారు. గ్రామసభ వేదికపై అధికారులకు మాత్రమే కుర్చీలు వేయాలి. పంచాయతీ కార్యదర్శి మాత్రం ప్రోటోకాల్ పదవులు లేని వారిని వేదికపై కూర్చోబెట్టారు. మాజీ వైస్ ఎంపీపీ వర్గానికి చెందిన ఓ డీలర్ ... మాజీ వార్డు మెంబర్ ఆదాంపై వేదికపై ఉండటంతో ఆగ్రహానికి గురయ్యారు. ‘మేం అసలైన టీడీపీ నాయకులం... మేం చెప్పిన వారినే కుర్చీలో కూర్చోబెట్టాలని’ అధికారులకు హుకుం జారీ చేశారు. అందరూ చూస్తుండగానే టీడీపీ నాయకులు దాడికి తెగపడటంతో అటు ప్రజలు, ఇటు అధికారులు విస్తుపోయారు.

తరచూ ఆధిపత్య పోరు

తెలుగు తమ్ముళ్ల ఆధిపత్య పోరు కారణంగా గ్రామాల్లో తరచుగా ఇలా గొడవలు, ఘర్షణలు జరుగుతున్నాయి. దీనిపై గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఈవోఆర్డీని రామకృష్ణను వివరణ కోరగా తోటవారిపాలెం గ్రామసభలో ఇరువర్గాల వారు తన్నుకున్నారని తెలిసిందన్నారు. దీని గురించి పంచాయతీ కార్యదర్శి వివరణ కోరామన్నారు. కాగా, ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేసిన జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్‌పై కూడా దాడి చేసి కొట్టారు. పంచాయతీ కార్యదర్శి తీరు వల్లే ఈ ఘర్షణ జరిగిందనే ప్రచారం సాగుతోంది.

మద్యం విక్రయాల పెంపునకు ‘పర్మిట్’

మద్యం ఆదాయంపైనే దృష్టి పెట్టిన కూటమి సర్కార్.. ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసింది. ఇప్పటివరకు బార్లకు మాత్రమే పరిమితమైన సిట్టింగ్.. ఇక వైన్స్‌లోనూ ‘పర్మిట్ రూం’ పేరుతో ఏర్పాటు చేసుకునేలా కూటమి పాలకులు వెసులుబాటు కల్పించారు. ఈ సాకుతో రూ.కోట్లలో వ్యాపారుల నుంచి ఫీజుగా వసూలు చేయనున్నారు. పరోక్షంగా ఈ భారం మళ్లీ ప్రజలపైనే పడనుంది.

- జిల్లా వ్యాప్తంగా 129 దుకాణాల వద్ద ఏర్పాటుకు రంగం సిద్ధం
- లైసెన్స్ పేరుతో ఏటా రూ.8.50 కోట్లు అదనపు వసూలు
- ఇప్పటికే వాడవాడలా బెల్టు షాపులతో ఏరులై పారుతున్న మద్యం
- ఇటు ఆరోగ్యపరంగా, అటు ఆర్థికంగానూ ప్రజలు గుల్ల
- పరోక్షంగా ఈ ఆర్థిక భారమంతా మళ్లీ ప్రజలపైనే మోపనున్న సర్కారు

దుకాణాల వద్ద పర్మిట్ రూములకు కూటమి ప్రభుత్వం అనుమతి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: మద్యం ఏరులై పారించేందుకు కూటమి ప్రభుత్వం గేట్లు ఎత్తేసింది. ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు కట్టబెట్టి రూ. వేల కోట్ల రాబడి పొందుతోంది. ఇది చాలదన్నట్లు ప్రజల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెడుతోంది. ఇప్పుడు వైన్స్ వద్ద పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిలిచ్చింది. ఇప్పటికే అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారులు మద్యం విక్రయాలు పెంచుకుంటున్నారు.

అందినకాడికి పిండేస్తున్న పాలకులు

వార్షిక లైసెన్సు ఫీజులు కట్టడానికి మద్యం వ్యాపారులు వాడవాడలా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. పర్మిట్ రూముల పేరుతో చంద్రబాబు సర్కార్ వసూళ్లు మొదలుపెట్టడంతో ఆ భారం మళ్లీ ప్రజలపైనే పడనుంది. ప్రతిమద్యం దుకాణం వద్ద కూర్చొని మద్యం తాగేందుకు ప్రభుత్వం పర్మిట్ రూములు తప్పనిసరి చేసింది. ఇందుకు ప్రత్యేకంగా రిటైల్ ఎక్సైజ్ సుంకం పేరుతో భారీగా వడ్డనకు సిద్ధమైంది. రూ. 55 లక్షలలోపు వార్షిక లైసెన్సు ఫీజు చెల్లించే మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌కు రూ. 5 లక్షలు లైసెన్సు ఫీజు నిర్ణయించింది. రూ. 65 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు వార్షిక లైసెన్సు రుసుము ఉన్న దుకాణాలకు రూ.7.50 లక్షలు ఫీజుగా తేల్చింది. ఈ మొత్తం నవంబర్ 10వ తేదీ నాటికి ఒకే విడతలో చెల్లించాల్సి ఉంటుంది.

బాదుడే బాదుడు...

జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 129 మద్యం దుకాణాలు ఉన్నాయి. రూ. 55 లక్షల వార్షిక లైసెన్సు రుసుము చెల్లించే దుకాణాలు 42 కాగా, రూ. 65 లక్షల నుంచి రూ.85 లక్షల వార్షిక ఫీజు చెల్లించే దుకాణాలు 86 ఉన్నాయి. వీటిలో పర్మిట్ రూముల లైసెన్సు ఫీజు కింద ప్రభుత్వానికి ఏడాదికి రూ. 8.50 కోట్లు అదనపు రాబడి సమకూరనుంది. ఈ దుకాణాలలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 12 దుకాణాలు మినహా మిగిలిన వాటిలో 90 శాతం దుకాణాల వ్యాపారులు విక్రయాలు పెంచుకునేందుకు వాడవాడలా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వైన్స్‌లో మద్యం క్వార్టర్ బాటిల్‌పై రూ. 20 నుంచి రూ.50 వరకూ అధిక ధర వసూలు చేస్తున్నారు. ఇక బెల్టు దుకాణాల వద్ద ధరలు మరింత అదనంగా ఉన్నాయి.

పర్మిట్ రూములకు అనుమతి

జిల్లాలో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూములకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. బహిరంగ మద్యపానం పెరిగి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని భావించి ఈ ఏర్పాట్లు చేస్తోంది. నవంబర్ 10వ తేదీ నాటికి ఒకే విడతలో ఫీజు చెల్లించాలి.

– బి.వెంకటేశ్వర్లు,
జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి

కూటమి నేతలు మాటలకే పరిమితం

మద్యం అమ్మకాలపై 20 శాతం ప్రాఫిట్ పర్సంటేజీ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం తర్వాత 8 శాతం కమీషన్‌తో సరిపెట్టింది. నష్టాల్లో కూరుకుపోతున్నామని నిర్వాహకులు కోర్టుకు వెళ్లడంతో పర్సెంటేజీ 14 శాతానికి పెంచి చేతులు దులుపుకొంది. ఇప్పటికే స్థానిక పచ్చ నేతలకు ఎంతో కొంత ముట్టజెబుతూ పర్మిట్ రూములు అనధికారికంగా వ్యాపారులు ఏర్పాటు చేశారు. బహిరంగంగా మందు బాబులు దుకాణాల వద్దే మద్యం తాగడంపై ఫిర్యాదులు వస్తున్నాయంటూ కూటమి ప్రభుత్వం ఇలా వసూళ్లకు దిగింది. గత ప్రభుత్వంలో మద్యం విధానాన్ని తప్పుపట్టిన కూటమి నేతలు.. బెల్టు దుకాణాలు లేకుండా కట్టడి చేస్తామని ఊదరగొట్టారు. ఇప్పుడు విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు దుకాణాల వద్దే పర్మిట్ రూముల పేరుతో మందు తాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాపట్లలో జింక సంచారం



బాపట్లలో ఫుడ్ సైన్స్ కళాశాలలో జింక సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారి బాలకృష్ణ తెలిపారు. లేడీస్ హాస్టల్ కావటంతో జింకను శనివారం ఉదయం పట్టుకుంటామని పేర్కొన్నారు. జింక కనిపిస్తే ఎవరు హాని చేయవద్దని సూచించారు. మూగజీవాలను కాపాడటం అందరి బాధ్యతని పేర్కొన్నారు. లేడీస్ హాస్టల్‌లోకి జింక రావడంతో దానిని చూసేందుకు అక్కడ ఉంటున్న విద్యార్థులు ఆసక్తి చూపారు. -బాపట్ల



మంత్రి గొట్టిపాటి నుంచి అవార్డు అందుకుంటున్న ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్



గ్లోరియా బాపట్ల ఆర్డీఓ | టి.చంద్రశేఖర్ చీరాల ఆర్డీఓ | ఎన్.రామలక్ష్మి రేపల్లె ఆర్డీఓ | జి.రామాంజనేయులు బాపట్ల డీఎస్పీ | పి.బాలమ్మ డిప్యూటీ సీఈఓ | సీహెచ్ కృష్ణ సీఈఓ | కె.ఎల్.ప్రభాకరరావు డీపీఓ | కె.శ్రీనివాసరావు డీఆర్‌డీఏ పీడీ | ఏ.వి. విజయలక్ష్మి డ్వామా పీడీ | రాధామాధవి ఐసీడీఎస్ పీడీ | కె.ప్రసాదరావు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్



జి.రఘునాథరెడ్డి బాపట్ల కమిషనర్ | అబ్దుల్ రషీద్ చీరాల కమిషనర్ | అరుణ డీఈ, ఆర్అండ్‌బీ | అనంతరాజు ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ | రాజ్‌దిబోరా, పీడీ ఎస్సీ సంక్షేమశాఖ | సూర్యప్రకాశరావు దేవాదాయ శాఖ జిల్లా | తన్నీరు మోహనరాజు జిల్లా సమాచారశాఖ అధికారి | సలీమా బాపట్ల తహసీల్దార్ | పి.జగదీష్‌నాయక్ సీసీఎస్ డీఎస్పీ | షేక్ మౌలుద్దీన్ అడ్మిన్ ఆర్ఐ | ఎ. మల్లికార్జునరావు రేపల్లె టౌన్ సీఐ

ఉత్తమ సేవలకు పతకాలు, ప్రశంసాపత్రాలు

ప్రభుత్వ, పోలీస్‌శాఖలలో విశేషకృషి చేసిన ఉత్తమ అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముఖ్యంగా పోలీస్‌శాఖలో విశిష్ట సేవలు అందించిన 37 మంది జిల్లా పోలీస్ అధికారులకు పతకాలను అందజేశారు. ఒకరికి మహోన్నత సేవా పతకం, ఇద్దరికి ఉత్తమ సేవా పతకాలు, తొమ్మిది మందికి అతి ఉత్తమ సేవా పతకాలు, పదహారు మందికి ఉత్తమ సేవా పతకాలు లభించాయి. వీటితోపాటు 95 మందికి పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రశంసాపత్రాల చొప్పన మొత్తం 132 మందికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

-బాపట్లటౌన్



హరికృష్ణ బాపట్ల సర్కిల్ సీఐ | కె.శ్రీనివాసరావు బాపట్ల రూరల్ సీఐ | ఆర్.రాంబాబు బాపట్ల టౌన్ సీఐ | పి.వి. ఆంజనేయులు వేమూరు సీఐ | ఎ. సుబ్బరాజు అద్దంకి సీఐ | పి. శేషగిరిరావు చీరాల రూరల్ సీఐ | డి. మల్లికార్జునరావు అద్దంకి రూరల్ సీఐ

తప్పిపోయిన తల్లిని కొడుకు వద్దకు చేర్చిన షీ టీం



వృద్ధురాలిని.. కొడుకు చెంతకు చేర్చిన షీ టీం ఎస్సై హరిబాబు

చీరాల అర్బన్: తప్పిపోయిన తల్లిని కొడుకు చెంతకు చేర్చారు చీరాల షీ టీం పోలీసులు. వివరాల్లోకి వెళితే.. బీహార్ నుంచి తప్పిపోయి 13 రోజుల కిందట వృద్ధురాలు రామ్‌కుమార్ దేవి చీరాలకు వచ్చింది. చీరాల సంపత్‌నగర్‌లోని ఓ షాపు ఎదురుగా ఉంటూ అర్థం కాని భాషలో ఏడుస్తుండేది. స్థానికులు గుర్తించి ఆమె యాచకురాలుగా లేదని భావించి ఆమెకు ఆహారం అందించారు. రోజులు గడచినా ఆమె బంధువులు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. షీ టీం ఎస్సై హరిబాబు తమ బృందంతో బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో విచారణ చేశారు. ఎట్టకేలకు ఆమె బీహార్ వాసిగా గుర్తించి ఆమె కుమారుడు అనిల్ సింగ్‌ను చీరాలకు రప్పించి సురక్షితంగా ఆమెకు కొడుకు చెంతకు చేర్చారు. ప్రత్యేక శ్రద్ధ చూపిన పోలీసులను స్థానికులు అభినందించారు.

స్వాతంత్య్రం రోజు ఏరులై పారిన మద్యం



బ్యాగులో ఉంచిన మద్యం సీసాలు



టూవీలర్‌పై మద్యం షాపు వద్దనే అమ్ముతున్న మద్యం

చీరాల: స్వాతంత్య్ర దినోత్సవం సమయాన చీరాల ప్రాంతంలో మద్యం ఏరులై పారింది. మద్యం షాపులు మూసివేయాలనే నిబంధన ఉన్నా అమ్మకాలు సాగాయి. ఎమ్మార్పీ కంటే రూ.30 నుంచి రూ.50 అదనంతో అమ్మకాలు చేపట్టారు. మద్యం షాపులు బయటే గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగించారు. పట్టణంలోని పలు వైన్ షాపుల ముందు ఇదే తంతు నడిచింది. జేబుల్లో, బ్యాగుల్లో, ద్విచక్రవాహనాల్లో పెట్టుకుని అమ్మకాలు సాగించారు.

దేశ సేవకు యువత సంసిద్ధులై ఉండాలి

- అమరవీరుల త్యాగాలు వృథా కాకూడదు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: దేశ సేవకు యువత సంసిద్ధులై ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుషార్‌డూడీ జెండా ఏగురవేశారు. ఎస్పీ మాట్లాడుతూ రెండు వందల ఏళ్ల పాటు సాగిన బ్రిటిష్ పాలనలో బానిసత్వాన్ని చవిచూసిన భారత దేశం, ఎందరో స్వాతంత్య్ర సమరయోధుల త్యాగ ఫలితంగా 1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా, స్వాతంత్య్రం వారి త్యాగ ఫలితమేనని, స్వతంత్ర సమరయోధులను గుర్తుచేసుకుంటూ వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ఎల్లవేళలా దేశ సేవకు సంసిద్ధులై ఉండాలి. అలాగే వారి త్యాగాలను వృథా కానివ్వకుండా మన దేశ ఉన్నతికి మనవంతు కృషి చేయాలన్నారు. త్యాగధనులు ఎలా అయితే మన దేశాన్ని గొప్పగా చూడాలని కలలు కన్నారో.. ఆ కలలను మనమందరం సాకారం చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేసిన విద్యార్థులకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి, డీపీఓ అధికారులకు మిఠాయిలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో బి. శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ పి. విజయసారథి, ఎస్‌బీ సీఐ నారాయణ, ఆర్ఐలు షేక్ మౌలుద్దీన్, టి.శ్రీకాంత్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరి పంట రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల వరి పంట రైతులు నష్టపోయినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో పంట వేసినప్పుడు వర్షాలు లేక పంట ఎండిపోయిందని, అప్పుడు ఎకరానికి రూ.10 వేలు పెట్టుబడి పెట్టారని, రెండోసారి వరిపంటవేసిన తరువాత అకాల వర్షాల కారణంగా నష్టపోయారని అన్నారు. గుంటూరు చానల్, కొండవీటివాగును రెండువైపులా వెడల్పు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడమే నష్టానికి కారణమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కమలాకర్ పాల్గొన్నారు.

జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ప్రారంభం



గుంటూరు రూరల్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్-వర్కర్స్ యూనియన్‌ను శుక్రవారం ప్రారంభించారు. జాతీయ జెండాను ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ శివాజీ, సీఐటీయూ జెండాను ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకుడు టీవీజీ రవిశంకర్, గుంటూరు జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్ -వర్కర్స్ యూనియన్ బోర్డును యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ దేశవ్యాప్తంగా రవాణా కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. సీఐటీయూ అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న అంబులెన్స్ డ్రైవర్లను అభినందించారు. ఆటోలు, అంబులెన్స్, ఇతర రవాణా కార్మికులకు ప్రభుత్వమే పార్కింగ్, వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ అంబులెన్స్ డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలుగా కార్మికులపై భారాలు మోపుతున్నాయన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గుంటూరు నగర తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు కట్లకుంట శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, నగర నాయకులు షేక్ ఖాసీం వలి, ఆదినికల్సన్, షేక్ ఖాసిం షహీద్, దొడ్డా కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు షేక్ బాషా, ఈసూబ్, వాజిద్, ప్రేమ్ కుమార్, పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



జాన్ మెడకు అయిన గాయం

తెనాలిరూరల్: పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని కొలకలూరులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉన్నం చినజాన్, సుద్దపల్లి రవీంద్రకు గతంలో విభేదాలున్నాయి. ఇరువురు కలసి మద్యం తాగే క్రమంలో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రవీంద్ర తనతో తెచ్చుకున్న కత్తితో జాన్‌పై దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు పంపారు. జాన్ ఇచ్చే స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

దేశ రక్షణ కోసం రెడ్ షర్ట్ ఆర్మీ సిద్ధంకావాలి



మంగళగిరి టౌన్: బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, దేశ రక్షణ కోసం రెడ్ షర్ట్ ఆర్మీ సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఒంగోలులో ఈనెల 28న జరగనున్న రాష్ట్ర మహాసభల్లో పాల్గొననున్న రెడ్‌షర్ట్ వలంటీర్లకు మంగళగిరి నగర పరిధిలోని బైపాస్ కనకదుర్గమ్మ అమ్మవారి గుడి వద్ద గల ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని శుక్రవారాన్ని ఆయన నాయకులతో కలసి సందర్శించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. దేశంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి రెడ్‌షర్ట్ ఆర్మీ సిద్ధం కావాలని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేసి సామాజిక చైతన్యం పెంపొందించడంలో ముందుండి కృషి చేయాలని సూచించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా నేటి ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నాయకులు కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

యువతీ, యువకులు ఆధ్యాత్మికంగా ఎదగాలి

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రముఖ సినీ నటుడు భానుచందర్



యువతీ, యువకులతో మాట్లాడుతున్న ప్రముఖ సినీ నటుటు భానుచందర్

చీరాల రూరల్: యువతీ, యువకులు చెడునడతలను విసర్జించి చదువుతోపాటు ఆధ్యాత్మికంగా ఎదగాలని సినీ నటుడు భానుచందర్ సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీసస్ వర్షిప్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నోవా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జాతీయ యూత్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు భానుచందర్ పాల్గొని తన జీవితంలో ప్రభువైన ఏసుక్రీస్తు చేసిన అద్భుతాలను తన కుటుంబ సాక్ష్యంగా యువతీయువకులకు ఎంతో విపులంగా వివరించారు. ప్రతి ఒక్కరూ బైబిల్‌లోని పది ఆజ్ఞలను తూచా తప్పకుండా పాటిస్తే ఏసుక్రీస్తును ఆరాధించినట్లేనని చెప్పారు. తనవలే తన పొరుగువారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు చెప్పారని ప్రతి ఒక్కరూ ఎదుటి వారిపై సోదర ప్రేమను చూపాలని సూచించారు. రోజులు బహు చెడ్డగా ఉన్నవని ప్రస్తుత పరిస్థితుల్లో దేవుని తన రక్షకునిగా స్వీకరించి మారుమనస్సు పొందాలని సూచించారు. కార్యక్రమంలో యువతి, యువకులు వీనులవిందైన సంగీతాల మధ్య దేవుని గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ నోవా అజయ్‌కుమార్ ఆయన సతీమణి రమా ఏంజలిన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతి, యువకులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

ఘనంగా జిల్లెళ్లమూడి అమ్మ వార్షికోత్సవం



కూరగాయల అలంకరణలో అమ్మవారు

బాపట్లటౌన్: మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామంలో వెంచేసియున్న అమ్మ అన్నపూర్ణాలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. విశ్వజననీ పరిషత్ ట్రెజరర్ జె.సుబ్రమణ్యం మాట్లాడుతూ విశ్వజననిగా విఖ్యాతి చెందిన మాతృశ్రీ అనసూయ మహాదేవి జిల్లెళ్లమూడి అమ్మ వారిచే 1958లో స్థాపితమై, ఆకలే అర్హతగా, డ్రస్ అడ్రస్‌తో పనిలేకుండా, ఎవరు ఏ వేళప్పుడు వచ్చిన ఆదరణ పూర్వకంగా అన్నం పెట్టి, కడుపు నింపే జిల్లెళ్లమూడి అందరింటి అన్నపూర్ణాలయం 67వ వార్షికోత్సవ వేడుకలు ఆగస్టు 15న ఘనంగా జరిగాయన్నారు. వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక కూరగాయల అలంకరణలో అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారన్నారు.

అమ్మ స్వయంగా ఆచరించి చూపించిన ఆదర్శ భావా లను అందరితో పంచుకున్నారు. అనంతరం అమ్మ సంస్థచే నడుపబడుతున్న మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలో భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం సామూహికంగా పలు స్తోత్ర పారాయణలు గావించారు. శ్రీ విశ్వజనని పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కడి సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి లారీ డ్రైవర్ మృతి



ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

పర్చూరు(చినగంజాం): ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన సంఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం పర్చూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నరసరావుపేట నుంచి చీరాల వైపు వస్తోంది. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వద్ద బస్సులోని కొందరు ప్రయాణికులను దించి అప్పుడే హైవే ఎక్కుతోంది. ఆ సమయంలో పర్చూరు నుంచి వస్తున్న లోడు లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ వైపు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఆ సమయంలో లారీని నడుపుతున్న డ్రైవర్ వాసు మల్ల సాల్మన్‌రాజు (43)కు తీవ్ర గాయాలై లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్ఐ జీవీ చౌదరి, ఏఎస్ఐ సాంబశివరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి లారీలో ఇరుక్కుపోయిన అతనిని శ్రమించి అతి కష్టం మీద బయటకు తీశారు. ప్రమాదంలో అతని కాళ్లు నుజ్జు అయి అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో అతనిని అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి గుంటూరు తరలిస్తుండగా మృతి చెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న పర్చూరుకు చెందిన కోటేశ్వరమ్మకు తలకు, మండలంలోని పెదజాగర్లమూడికి చెందిన మరో మహిళ సలోమికి ఎదురు సీటు రాడ్ పొడుచుకొని నుదుటిపై తీవ్ర గాయమైంది. వారివురిని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మరో ఇరువురు మహిళలకు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కేసు నమోదు చేసుకొన్నట్లు ఏఎస్ఐ సాంబశివరావు తెలిపారు.

వరదకు కొట్టుకుపోయిన పెదమద్దూరు రోడ్డు

నిలిచిపోయిన అమరావతి–విజయవాడ రాకపోకలు



పూర్తిగా ధ్వంసమైన అమరావతి-పెదమద్దూరు రోడ్డు దృశ్యాలు

అమరావతి: కొద్ది రోజుల కింద వచ్చిన వరదకు పెదమద్దూరు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అమరావతి నుంచి విజయవాడ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పెదమద్దూరు వద్ద సుమారు అర కిలోమీటరు మేర పూర్తిగా ధ్వంసమైంది. వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాల ప్రజలతోపాటుగా అమరావతి నుంచి విజయవాడకు వెళ్లే వారికి విజయవాడ నుంచి అమరావతి వచ్చే యాత్రికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అమరావతి నుంచి వైకుంఠపురం పెదమద్దూరు వెళ్లాలంటే నరుకుళ్లపాడు, ఎండ్రాయి, చావపాడు మీదుగా సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిందే.

ప్రస్తుతం విజయవాడ-అమరావతి బస్సులు పెదమద్దూరు వరకు వచ్చి అక్కడి నుండి వెనుతిరుగుతున్నాయి. గురువారం రాత్రి పెదమద్దూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ సిబ్బంది కాపాలా కాస్తున్న అమరావతికి చెందిన ట్రాక్టర్ అమరావతి నుంచి వైకుంఠపురం వైపు వెళ్ళటానికి ఈ రోడ్డు గుండా వచ్చి ప్రమాదవశాత్తు వాగులో పడి వరదనీటిలో మునిగిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది. వెంటనే ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు కనీస మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.